సిద్ధమైన టిడ్కో ఇళ్లు


ఏఎస్సార్ నగర్ గ్రామసభలో మాట్లాడుతున్న కె.కె.రాజు(ఫైల్)

- త్వరలోనే ఏఎస్సార్ నగర్‌వాసులకు అందజేత
- ప్రధాన పనులన్నీ పూర్తి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు ఏఎస్సార్ నగర్‌లో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తయింది. త్వరలోనే కాలనీ లబ్ధిదారులకు వాటిని అందజేయనున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 3 తెగలకు చెందిన వారు నివసించే వారు. వీరి కోసం గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ టిడ్కో ద్వారా గృహాలు నిర్మించి ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. గత ప్రభుత్వం తాత్సారం చేయడంతో తదుపరి అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసింది. ఏఎస్సార్ నగర్‌లో 300 చదరపు గజాలు, 365 చ.గ., 430 చ.గ., ఫ్లాట్స్ చొప్పున మొత్తం 280 గృహాలు నిర్మించారు. పూర్తిగా మౌలిక వసతులు కల్పించి జూన్ నెలాఖరు నాటికి లబ్ధిదారులకు అందజేసేందుకు చురుగ్గా సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రధాన పనులు పూర్తి కాగా.. శానిటేషన్, పైప్‌లైన్, డ్రైనేజీలు, రోడ్లు వంటి చిన్న చిన్న పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి.

ఇప్పటికే చెంచులకు కేటాయింపు..

భారత రాష్ట్రపతి, ఎస్సీ, ఎస్టీ, కమిషన్ కలెక్టర్‌ల ఆదేశాల మేరకు ఈ ప్రాంతంలో నివసిస్తున్న చెంచుల తెగలో గతంలో సిద్ధపరచిన జాబితాలో అర్హులైన 131 మందికి ఇప్పటికే ఇళ్లు కేటాయించారు. మిగిలిన వారిలో పాత జాబితా ప్రకారం ఉన్న 68 మంది కోసం సర్వే చేస్తున్నారు. వీరు ప్రభుత్వం ద్వారా ఎక్కడైనా ఇళ్లు, స్థలం పొందుకున్నారా? ఉద్యోగాలు పొందారా అని సర్వే చేసి, వెంటనే వీరిలో అర్హులైన వారికి కూడా ఇళ్లు కేటాయించనున్నారు. వీరే కాకుండా ఇదే ప్రాంతంలో నివసించిన మరికొందరికి కూడా స్థానిక కమిటీ సూచనల మేరకు ఇళ్లు అందజేయనున్నారు.


45వ వార్డు ఏఎస్సార్ నగర్‌లో నిర్మించిన టిడ్కో గృహాలు

ఒక్క రూపాయికే..

ఇక్కడ నివసిస్తున్న పేదలకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కేవలం ఒక్క రూపాయికే 300 చ.గ. ఇల్లును కేటాయిస్తోంది. ఈ జాబితాలో సుమారు 188 గృహాలు ఉన్నాయి. 365 చదరపు గజాలు, 435 చ.గ. ఇళ్లకు రూ.3.15 లక్షలు, రూ.3.65 లక్షలు నిర్దేశించారు. దీనిలో లబ్ధిదారుల వాటా రూ.25 వేలు, రూ.50 వేలు ఉంటుంది. మిగిలిన మొత్తాన్ని కూడా బ్యాంకుల ద్వారా రుణాలు ఏర్పాటు చేయనున్నారు.

అర్హులందరికీ సొంతిళ్లు

ఈ ప్రాంతంలో నివసించే అర్హులందరికీ ఎవ్వరి రికమండేషన్లు అవసరం లేకుండా ఇళ్లు కేటాయిస్తున్నట్లు ఇటీవల ఏఎస్సార్ నగర్‌లో నిర్వహించిన గ్రామసభలో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు స్పష్టం చేశారు. అందరికీ సొంత ఇళ్లు కల్పించాలనేది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన ఉద్దేశమన్నారు. ఏఎస్సార్ నగర్‌వాసులు ఎవరో చెప్పిన మాటలు విని మోసపోవద్దని చెప్పారు. అధికారులు నిష్పక్షపాతంగా సర్వే చేస్తున్నారని వారికి సహకరించాలని కోరారు.

ప్రతి లబ్ధిదారుడికి గృహం

ఈ ప్రాంతంలో నివసిస్తున్న చెంచులకు ఇప్పటికే ఇళ్లు కేటాయించాం. మిగిలిన వారిలో అర్హులను గుర్తిస్తున్నారు. వీరికి కూడా ఇక్కడే గృహాలు కేటాయిస్తాం. ఎటువంటి అనుమానాలకు తావులేకుండా నిష్పక్షపాతంగా ప్రతి లబ్ధిదారుడికి ఇల్లు అందిస్తాం. జూన్ నెలాఖరుకు సిద్ధం చేసి అందజేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం.

– పాపునాయుడు, జీవీఎంసీ హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్

జూన్ చివరికి పనులన్నీ పూర్తి

ఏఎస్సార్ నగర్‌లో అర్హులైన పేదలకు ఇళ్ల కేటాయింపు ప్రక్రియను కొంతమంది స్వార్థప్రయోజనాలతో మోకాలడ్డుతున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. వీరి వల్ల లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు ఆలస్యమవుతోంది. ఇళ్ల నిర్మాణం పూర్తయింది. అన్ని పనులు పూర్తిచేసి జూన్ నెలాఖరుకు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

– కంపా హనోకు, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 45వ వార్డు కార్పొరేటర్

జగనన్న పాలనలో ఇంటింటా సంక్షేమం

- చంద్రబాబు అండ్ కో దుష్ప్రచారాలను ప్రజలు నమ్మరు
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో కె.కె.రాజు

మద్దిపాలెం: రాష్ట్రంలో సంక్షేమ పాలన నడుస్తోందని, ప్రతిపక్షనేత చంద్రబాబు అండ్ కంపెనీ చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మరని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 53వ వార్డు మహారాణి వీధి–1 సచివాలయం(297) పరిధిలోని శివనగర్, భాస్కర్ గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ బర్కత్ అలీతో కలిసి ఆయన ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. ఏ ప్రభుత్వమూ చేయని విధంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు అండ్ కో కలిసి చేస్తున్న పిచ్చి ప్రచారాలను ప్రజలు నమ్మడం లేదన్నారు. టీడీపీ హయాంలో చెప్పే మాటలన్నీ పేపర్లకే పరిమితమయ్యాయని ఎద్దేవా చేశారు. జగనన్న మాత్రం తాను చెప్పింది చేతల్లో చేసి చూపిస్తున్నారని కె.కె.రాజు కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుజ్జు వెంకటరెడ్డి, యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి ఎం.సునీల్, డైరెక్టర్ రాయుడు శ్రీనివాసరావు, నూకరాజు, వార్డు నాయకులు షేక్ బాబ్జి, హనుమంతు, జ్ఞానేష్, సుశీల, జ్యోత్స్న, సూర్య, జయ, సుజాత, లక్ష్మి, మంగ తదితరులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ బర్కత్ అలీ

ధ్యాన మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. బాబాకు మధ్యాహ్న హారతి సమర్పించిన అనంతరం భక్తులు, పేదలు, యాచకులకు అన్నదానం జరిపారు. రాత్రి పల్లకీ సేవలో మహిళా భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ధ్యాన మందిరంలో ఓమ్ని ఆర్కే ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆలయ సిబ్బందితోపాటు సుమారు 100 మంది భక్తులు వైద్య సేవలు పొందారు. పెద్దలు, చిన్నపిల్లలకు పలు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. మంగమ్మ డెంటల్ హాస్పిటల్ సహకారంతో దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం మారుతున్న వాతావరణం పరిస్థితుల దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు వహించాలని వైద్య సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, హాస్పిటల్స్ డాక్టర్ చిత్తరంజన్, సిబ్బంది గౌరినాయుడు, చంటి, దేవిక, మానస పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో పాల్గొన్న భక్తులు

వినియోగదారుల రక్షణ చట్టంపై శిక్షణ తరగతులు

కంచరపాలెం: స్థానిక ఐటీఐ జంక్షన్‌లోని జిల్లా వినియోగదారుల సంఘం సమైక్య కార్యాలయంలో సంఘ చైర్మన్ మద్ది సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం వినియోగదారుల రక్షణ చట్టంపై సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ఏయూ రిటైర్డ్ వీసీ ఆచార్య లజపతిరాయ్, బీఐఎస్ సైంటిస్ట్ సంధ్య మాట్లాడుతూ సమాజంలో వినియోగదారులు ఎలా మోసపోతున్నారో తెలుసుకోడానికి కొన్ని సంస్థలను ఎంపిక చేసి సర్వే రిపోర్ట్‌ను ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. కోర్టు అంటే భయపడే వారు, చదువురాని వారికి వినియోగదారుల సంఘం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే వినియోగదారుల రక్షణ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో బీఐఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి బీఐఎస్ బ్యాచ్ నంబర్ చెక్ చేసుకుని వస్తువులు కొనుగోలు చేయాలని ట్రెనింగ్ ఇచ్చారు. వినియోగదారుల సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఫెడ్కో చైర్మన్ సత్యనారాయణ తెలిపారు.

రవాణా రంగాన్ని కాపాడండి

సీతంపేట: ప్రజలపై ఆర్థిక భారాలు వేసే జీవో నంబర్ 31ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ గురువారం అక్కయ్యపాలెం కూడలిలో నిరసన చేపట్టింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గూడ్స్ లారీలు, ప్రైవేట్ బస్సులు, వ్యాన్లు, కార్లపై భారీగా పన్నులు పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 31ని రద్దు చేసి రవాణా రంగాన్ని కాపాడాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు లేక స్వయం ఉపాధి కింద ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల నుంచి అధిక వడ్డీలకు అప్పులు తీసుకుని లారీలు, వ్యాన్లు, కార్లు, జీపులు కొనుగోలు చేసి ప్రజలకు సేవలందిస్తూ ప్రభుత్వానికి కోట్లాది రూపాయాల పన్నులు చెల్లిస్తున్న వాహన యజమానులకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. మరో పక్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపు, జీఎస్టీ పన్నులతో రవాణా రంగం కుదేలవుతోందన్నారు. జీవో రద్దు చేయని పక్షంలో ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రావికృష్ణ, శివ, కె.రాము, జి.శ్రీను, అప్పలరాజు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

పబ్లిక్ డిమాండ్

తాగునీరు పట్టేదేలా..!

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు 104 ఏరియా బాపూజీనగర్‌లోని తాగునీటి బోరు పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. చుట్టూ మట్టి, రాళ్ల గుట్టలు, చెత్తాచెదారం పేరుకుపోయి ఉంది. బోరు నీరు పట్టుకునేందుకు వీలు లేని పరిస్థితి ఏర్పడింది. గత నెలలో ఇక్కడ విద్యుత్ స్తంభం కోసం గోతులు తవ్వినప్పుడు ఆ మట్టి రాళ్లను బోరుపై వేసి వదిలేశారు. అసలే మండువేసవి కావడంతో బోరు నీరు పట్టుకునేందుకు స్థానికులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి ఈ సమస్యను తక్షణం పరిష్కరించాలి.

– రాజశేఖర్, బాపూజీనగర్


బాపూజీనగర్‌లో అధ్వానంగా బోరు పరిసరాలు

పూడిక తరలించండి

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు శంకువానిపాలెం గెడ్డ వద్ద పడవేసిన పూడిక తరలించాలి. గెడ్డలోంచి తొలగించిన పూడిక, చెత్తను రోడ్డు పక్కన పెద్ద కుప్పగా పడవేశారు. వారం రోజులు గడిచినా తరలించలేదు. దీని నుంచి వచ్చే దుర్వాసన, ఈగలతో నివాసులు ఇబ్బంది పడుతున్నారు. చుట్టుపక్కల వారు చెత్తను అక్కడే పడవేస్తుండటంతో రోత పుట్టిస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి.


శంకువానిపాలెం గెడ్డ వద్ద వదిలేసిన పూడిక

– కె.శ్రీనివాసరావు, శంకువానిపాలెం

క్లుప్తంగా

మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న అలియన్స్ క్లబ్ ప్రతినిధులు

సీతమ్మధార: అలియన్స్ క్లబ్ ఆఫ్ ఆక్సిజన్ టవర్స్(సీతమ్మధార) ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఆక్సిజన్ టవర్స్ ఎదురుగా బాటసారులకు క్లబ్ ప్రతినిధులు చల్లని మజ్జిగ అందజేశారు. మూడు రోజులుగా వేసవి ఉష్ణోగ్రతలు పెరగడంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. స్థానికులు, పాదచారులు, వాహన చోదకులు మజ్జిగ తాగి హర్షం వ్యక్తం చేశారు.

సీసీ కెమెరా పడి జీపు అద్దాలు ధ్వంసం

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి అక్కయ్యపాలెం సిగ్నల్ పాయింట్ వద్ద సీసీ కెమెరా జీపు మీదపడటంతో దాని అద్దాలు ధ్వంసమయ్యాయి. వివరాలిలా.. గురువారం ఉదయం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌కు చెందిన ఓ వ్యాపారి జీపులో అక్కయ్యపాలెం వెళ్తుండగా సిగ్నల్ పడిందని పాయింట్ వద్ద ఆగాడు. అక్కడి పోల్‌కు జీవీఎంసీ అధికారులు ఏర్పాటు సీసీ కెమెరా ఒక్కసారిగా జీపు అద్దం మీద పడింది. తన వాహనం అద్దాలు ధ్వంసం కావడంతో వ్యాపారి ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ ఆ సీసీ కెమెరాను సీఐ వద్దకు తీసుకెళ్లారు. ఒకవేళ పాదచారుల మీద అది పడి ఉంటే తలకు తీవ్రగాయాల పాలయ్యేవారు.

కాళీ కాలభైరవులకు రుద్రాభిషేకం

సీతంపేట: మాస శివరాత్రి సందర్భంగా గురువారం సాయంత్రం లలితానగర్ లలితా పీఠంలో కాళీ కాలభైరవులకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పీఠం అర్చకుల వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా అభిషేకం జరిపించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. అమావాస్య సందర్భంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు శ్రీప్రత్యంగిరా భద్రకాళి హోమం జరుగుతుందన్నారు. పాల్గొన దలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అన్ని కళల్లో పిల్లలు రాణించాలి


క్లాత్‌పై వేసిన డిజైన్లతో పిల్లలు

మురళీనగర్: పిల్లలు అన్ని కళల్లో రాణించాలని గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు ఎం.శంకరరావు ఆకాంక్షించారు. మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రిసోర్స్ పర్సన్ కె.భానుమతి, జి.షీలారాణి, ఆర్.స్నేహలత సమక్షంలో పిల్లలకు క్లాత్‌పై డిజైన్లు వేయడం నేర్పారు. గ్రంథాలయ అధికారి వై.పద్మజ పర్యవేక్షించారు.

విజేతలకు వీసీ అభినందన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉన్నత్ భారత్ అభియాన్ రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో అభినందించారు. ఉన్నత భారత్ అభియాన్ లక్ష్యాలకు అనుగుణంగా కళాశాలల వారీగా ఈ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, యూబీఏ నోడల్ అధికారి ఆచార్య జి.నాగరాజు, ప్రాంతీయ సమన్వయకర్త బి.పావని, డాక్టర్ సోనీ హవీల, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ క్రైం పోలీస్ స్టేషన్‌ను గురువారం మధ్యాహ్నం క్రైం డీసీపీ జి.నాగన్న సందర్శించారు. ఆయనను క్రైం సీఐ ఎర్రం నాయుడు, ఎస్ఐ ఖగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రికార్డులు, సీడీ ఫైల్స్‌ను పరిశీలించిన డీసీపీ పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సిబ్బంది సంక్షేమంపై ఆరా తీశారు. ఎంత మంది విధుల్లో ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని, రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై నిఘా పెట్టాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్ ఇరుగ్గా ఉండటంతో కొత్త భవనం విషయమై సీపీ దృష్టిలో పెడతానని తెలిపారు. దీనికి ప్రతిపాదనలు పంపించాలన్నారు. నైట్ డ్యూటీల సమయంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వ్యాపార సంస్థలు, అపార్ట్‌మెంట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.


రికార్డులు పరిశీలిస్తున్న క్రైం డీసీపీ నాగన్న

బోదకాలు వ్యాధి నియంత్రణపై అవగాహన

మద్దిపాలెం: జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా గురువారం బోదకాలు వ్యాధి(ఫైలేరియా) పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 51వ వార్డులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాధవధార మాధవస్వామి కల్యాణ మండపంలో అంబేడ్కర్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వెంకటేష్ ఆధ్వర్యంలో వ్యాధికి సంబంధించి అన్ని విషయాలను వివరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగాన్ని దృష్టిలో పెట్టుకుని అందరికీ ఉచిత వైద్యం అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం బోదకాలు వ్యాధిగ్రస్తులను గుర్తించి, నాలుగో స్టేజీలో ఉన్నవారికి కిట్లు, రూ.5 వేల పెన్షన్ అందిస్తోందని చెప్పారు. గత ప్రభుత్వాలు పెన్షన్లు, కిట్లు ఇవ్వలేదని గుర్తు చేశారు. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక సచివాలయాల్లో ఉన్న ఏఎన్ఎంలు, యూపీహెచ్‌సీ కేంద్రాల్లో పనిచేస్తున్న ఆశా వర్కర్ల ద్వారా బోదవ్యాధిగ్రస్తులను గుర్తించి తక్షణమే వారికి వైద్య సదుపాయం అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో జోన్–5 నోడల్ ఆఫీసర్ నాగశ్రీను, ఆర్‌వీ లోక్‌నాథ్, ఎం.కృష్ణమోహన్, నాగరాజు, కిషోర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు శ్యామ్, గణేష్, వినోద్ పాల్గొన్నారు.


కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

'నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల నిర్వహణా?'

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘ సర్వసభ్య సమావేశం గురువారం విశాఖలో జరిగింది. ఏపీఎఫ్ఏకు అనుబంధంగా ఉన్న ప్రస్తుత 26 జిల్లాలకు గానూ 20 జిల్లాలకు చెందిన ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. కాగా.. రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఎన్నిక నేపథ్యంలో శుక్రవారం తిరుపతిలో జరగనున్న సమావేశానికి ప్రస్తుత అధ్యక్షుడి హోదాలో హాజరుకావాల్సిందిగా బుధవారం మెయిల్ పంపారని ఏపీఎఫ్ఏ అధ్యక్షుడు కె.గోపాలకృష్ణ తెలిపారు. రాష్ట్ర సమావేశాన్ని విశాఖలో గురువారం నిర్వహించేందుకు గతంలోనే నిర్ణయించామని గుర్తు చేశారు. ఏపీఎఫ్ఏకు రిజిస్టరై ఓటింగ్ కలిగిన వ్యక్తులు లేకుండా ఎన్నిక ప్రక్రియ నిర్వహిస్తుండడంపై మండిపడ్డారు. రాష్ట్ర స్థాయి ఎంపికలు చేసిన వారికి ఓటింగ్‌లో పాల్గొనే అర్హత లేకుండా సన్నాహాలు చేయడాన్ని తప్పుపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చనసేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

షిర్డీసాయిని దర్శించుకున్న అరకు ఎంపీ


అరకు ఎంపీ మాధవి దంపతులను సత్కరిస్తున్న ధ్యాన మందిర కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరాన్ని గురువారం అరకు ఎంపీ గొడ్డేటి మాధవి దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. మందిర వ్యవస్థాపకులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు వీరిని ఘనంగా సత్కరించారు.

పాలిటెక్నిక్ ప్రవేశాల కమిటీలో గైస్ ప్రిన్సిపాల్

మురళీనగర్: 2023 పాలిసెట్ అడ్మిషన్ కమిటీలో విశాఖపట్నం గవర్నమెంట్ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణకు అవకాశం కల్పించారు. పాలిటెక్నిక్‌లో చేరే అభ్యర్థుల ఎంపికలో ఈయన బోర్డు మెంబర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు.

వివాహితపై వేధింపులు

మద్దిపాలెం: వివాహితను ఒక వ్యక్తి వేధింపులకు గురిచేయడంతో ఆమె తన భర్త మోహన్ అశోక్‌బాబుతో కలిసి గురువారం కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కంచరపాలెం బర్మా క్యాంప్‌లో నివసిస్తున్న వివాహిత అన్నపూర్ణాదేవి గురువారం అదే ప్రాంతానికి చెందిన ఎస్.శ్రీనివాస్ తనతో మాట్లాడమని వేధించాడని అనంతరం, సదరు వ్యక్తి ఆమె ఇంటిపై గుడ్లు, రాళ్లతో దాడి చేశాడని ఆరోపిస్తూ ఫిర్యాదులో పేర్కొన్నారు. కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

శ్లోకాల పఠనంపై శిక్షణ

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు సంస్కృత శ్లోకాల పఠనంపై శిక్షణ ఇచ్చారు. సింహాచలం దేవస్థానం విశ్రాంత ప్రధానార్చకుడు గోపాల కృష్ణమాచార్యులు సంస్కృత శ్లోకాల పఠనంలో మెలకువలను వివరించారు.

హజ్ యాత్రికులకు జగనన్న ఆర్థిక సాయం హర్షణీయం


మాట్లాడుతున్న ఐహెచ్ ఫారూఖీ

తాటిచెట్లపాలెం: హజ్ యాత్రికులకు జగనన్న అందిస్తున్న ఆర్థిక సాయం హర్షించదగ్గ విషయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి ఐహెచ్ ఫారూఖీ అన్నారు. కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. హజ్‌కు వెళ్లే యాత్రికులకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య వ్యత్యాసం రూ.83,407 ఉండటం వల్ల ఏపీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌసుల్ అజామ్‌లు చొరవ తీసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారన్నారు. విజయవాడ గన్నవరం నుంచి వెళ్లే యాత్రికులకు రూ.80 వేల చొప్పున 1,814 మంది హాజీలకు నేరుగా వారి ఖాతాల్లో జమ చేసి, మరోసారి ముస్లిం మైనారిటీల పక్షపాతిగా నిరూపించుకున్నారని కొనియాడారు. దీంతో ఈ ఏడాది విజయవాడ గన్నవరం నుంచి హజ్‌కు వెళ్లే యాత్రికులకు సెంట్రల్ హజ్ కమిటీ రూ.3,88,580 చెల్లిస్తుందని, హైదరాబాద్ నుంచి హజ్‌కు వెళ్లే యాత్రికులకు సెంట్రల్ హజ్ కమిటీ రూ.3,05,173 చెల్లిస్తుందని చెప్పారు. జూన్ 12, 14 తేదీల్లో హజ్ యాత్రకు వెళ్తున్నారని పేర్కొన్నారు.